

పెంబర్తి వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా

## కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికిన ఎమ్మెల్యే పల్లా

జనగామ రూరల్, ఏప్రిల్ 23 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27 బీఆర్ఎస్ రజతోత్సవ జరుగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు బుధవారం ఆయన వెళ్తుండగా పెంబర్తి శివారులోని కాకతీయ కళాతోరణం వద్ద బీఆర్ఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌తో సెల్ఫీలు దిగేందుకు క్యూకట్టారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ పభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు యాదవ్, జనగామ మార్కెట్ మాజీ చైర్మన్లు గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బాల్దె సిద్దిలింగం, రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, నాయకులు గద్దల నర్సింగరావు, ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, ఉల్లెంగుల సందీప్, ఎండీ యాకుబ్ పాషా, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి : సీపీఎం

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 23 : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. కనకారెడ్డి మాట్లాడుతూ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మృతి చెందిన టూరిస్టులు, సామాన్య ప్రజల కుటుంబాలకు తమ సంతాపం ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్సనందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశ వ్యాప్తంగా ఉగ్రవాదులను నిర్మూలించేందుకు పెద్ద నోట్ల రద్దు చేస్తున్నామని, కశ్మీర్‌లో శాంతి నెలకొల్పడం కోసం ఆర్టికల్ 370 రద్దు చేశామని కేంద్రంలోని బీజేపీ సర్కారు చెప్పినా ఫలితం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాశ్, భూక్య చందు, బాల్నె వెంకటమల్లయ్య, సురేశ్, యాకన్న, బండ సౌందర్య, వరలక్ష్మి, సోమేశ్, ఉప్పలయ్య పాల్గొన్నారు.



అప్పిరెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆండాలు

## సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

దేవరుప్పుల, ఏప్రిల్ 23: కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి తీసుకు న్న ధాన్యాన్ని వెంటనే లారీల్లో నిర్ణీత రైస్ మి ల్లులకు తరలించాలని త హసీల్దార్ ఆండాళు అన్నా రు. మండలంలోని అప్పి రెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆండాలు బుధవారం పరిశీలించారు. ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. మట్టి, తేమలేని ధాన్యాన్ని తేవాలని ఆమె కోరారు. 25 మంది రైతులకు చెందిన ధాన్యం ఇక్కడ ఉందని వీఓఏ సిందె సత్య నారాయణ తహసీల్దార్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు, మాజీ సర్పంచ్‌లు పులిగిల్ల సుధాకర్, పులిగిల్ల మల్లయ్య పాల్గొన్నారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

CHANGE OF NAME

★I, DORNALA VARUN S/o DORNALA VENKATA NARAYANA R/o H.No: 3-17/A, Near Susheela Degree College, Didugupadu, Madhira, Khammam, Telangana. I have changed my Father's name from DORNALA VENKAT NARAYANA to DORNALA VENKATA NARAYANA for all future purposes.
NTW-7710

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565



పేరాల భవాని

## ఇంటర్‌లో సత్తా చాటిన భవాని

చిల్పూరు, ఏప్రిల్ 23 : ఇంటర్ పలితాలలో మండలంలోని చిన్నపెండ్యాల గ్రామా నికి చెందిన పేరాల భవాని అత్యధిక మార్కులు సాధించింది. మహబూబాబాద్ జిల్లా నెక్కొం డలోని ప్రభుత్వ గురుకుల కళాశా లలో బీపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న పేరాల భవాని 440 మార్కులకుగాను 435 సాధించి జిల్లాలోనే టాప్‌లో నిలిచింది. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు పేరాల మమత, ప్రభాకర్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. భవానీ 6 నుంచి 10వ తరగతి వరకు కరుణాపురంలోని జ్యోతిరావు పూలే గురుకులంలో చదివినట్లు తెలిపారు. చదువులో రాణిస్తుండడంతో కుటుంబ సభ్యులతోపాటు స్థానికులు భవానీని అభినందించారు.

## గాయపడిన యువకుడి మృతి

లింగాలఘనపురం, ఏప్రిల్ 23 : మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన నవాబుపేటకు చెందిన బూడిద సాయి కుమార్(26) బుధవారం మృతి చెందాడు. స్థానిక ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న సాయికుమార్ తన మిత్రుడు బోళ్ల కల్యాణ్‌తో కలసి జనగామ నుంచి నవాబుపేటకు బైక్‌పై వస్తుండగా కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కల్యాణ్ అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాయికుమార్‌ను దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆక్రమణలో అప్పిరెడ్డిపల్లి ముత్యం చెరువు

- నాలుగు ఎకరాలను కబ్జా చేస్తున్న కాంగ్రెస్ నేత
- హద్దులను పరిశీలించిన దేవరుప్పల తహసీల్దార్
- కలెక్టర్ దృష్టికి తెస్తానని ఆయకట్టుదారులకు హామీ



ముత్యం చెరువు చుట్టూ కనీలు నాటుకున్న రైతులు



తహసీల్దార్ ఆండాలుకు హద్దులు చూపుతున్న రైతులు

దేవరుప్పుల, ఏప్రిల్ 23 : మండలంలోని అప్పిరెడ్డిపల్లి ముత్యం చెరువు ఆక్రమణకు గురౌతున్నది. చెరువు చుట్టూ లింగాలఘనపురం మండలానికి చెందిన కుందారం, చీటూరు, కిష్టగూడెం, నేలపోగుల గ్రామాల శివార్లున్నాయి. చెరువు విస్తీర్ణం 119 సర్వే నంబర్‌లో 145 ఎకరాల 37 గుంటలు ఉంది. పక్క మండలాల సరిహద్దులుండడంతో ఆక్రమణకు గురయ్యే అవకాశముందని గమనించిన ముత్యం చెరువు ఆయకట్టుదారులు ఇటీవల దేవరుప్పుల, లింగాలఘనపురం తహసీల్ కార్యాలయాల్లో ఉండే సర్వేయర్లతో చెరువును కొలిపించి వారు చూపిన హద్దుల ప్రకారం రాతి కనీలు నాటారు. కాగా లింగాలఘనపురం మండలం చీటూరు రెవెన్యూ శివారు కిష్టగూడెం సరిహద్దులో 335 సర్వే నంబర్‌లో వడిచర్లకు చెందిన కాంగ్రెస్ నాయకుడు గండి యాదగిరి తన భార్య మంగమ్మ పేరున నాలుగు ఎకరాల భూమిని ఏడాది క్రితం కొనుగోలు చేశాడు. అతడు కిష్టపురంలోని కన్నెబోయిన భిక్షపతి, రాజయ్య వద్ద కొనుగోలు చేశాడు. భూమి కేవలం పాస్‌పుస్తకంలో ఉన్నా మోఖా మీద లేదు. అన్నీ తాను చూసుకుంటానని సదరు రైతులకు చెప్పి కొనుగోలు చేశాడు. తాను కొన్న భూమి అప్పిరెడ్డిపల్లి ముత్యం చెరువులో ఉందని వాదన తెరపైకి తెచ్చి చెరువులో చెట్లు కొట్టి ఆక్రమించేందుకు ఉపక్రమించాడు. అంతకు ముందే ముత్యం చెరువు ఆయకట్టుదారులైన రైతులు ఇరు మండలాల సర్వేయర్లు చూపిన హద్దుల్లో 5 ఫీట్ల కనీలు నాటి బందోబస్తు చేశారు. సదరు భూమిని కొన్న నేలపోగుల కాంగ్రెస్ నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించి, జిల్లా స్థాయిలో ఉన్న ల్యాండ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నూకరాజును ముత్యం చెరువు రప్పించి మరోమారు కొలతలు వేయించారు. గతంలో సర్వేయర్లు కొలిచిన కొలతలు తప్పని దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి ముత్యం చెరువులో లింగాలఘనపురం మండలం కిష్టగూడెం 335 సర్వే నంబరు భూమి ఉందని నిర్ధారించారు. ఈ కొలతలు ముత్యం చెరువు హద్దులను దాటి లోపలికి వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సదరు కాంగ్రెస్ నాయకుడు అధికారులపై ఒత్తిడి చేసి చెరువు ఆక్రమణకు తెగిస్తున్నాడని తెలిసింది. తమకు చెరువు శిఖం రికార్డుల్లో ఉన్న మాదిరిగా 145 ఎకరాల 37 గుంటలు కొలిచి చూపిస్తే సరిపోతుందని రైతులు పేర్కొంటున్నారు.

### ముత్యం చెరువును పరిశీలించిన తహసీల్దార్

ఆయకట్టు రైతుల ఫిర్యాదుతో దేవరుప్పుల తహసీల్దార్ ఆండాలు బుధవారం ముత్యం చెరువును పరిశీలించారు. రైతులు హద్దులను చూపించి ముత్యం చెరువు శిఖంను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆమెకు తెలిపారు. దీనిపై స్పందించిన ఆమె రైతుల ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ దృష్టికి తెస్తానని, రెండు గ్రామాల మధ్య హద్దుల సమస్య కావడంతో జిల్లా అధికారుల దృష్టికి తెచ్చి రీసర్వేకు ప్రయత్నం చేస్తానన్నారు. దీనిపై లిఖితపూర్వక ఫిర్యాదు అందించాలని ఆయకట్టుదారులకు సూచించారు.



### పట్టా భూమికాదు చెరువు శిఖమే..

తాను చిన్ననాటి నుంచి వ్యవసాయం చేస్తున్న. ఆక్రమణకు గురౌతున్న భూమి ముత్యం చెరువు శిఖమే. అది దేవరుప్పుల మండల శివారే. సదరు కాంగ్రెస్ నాయకుడు కొన్న భూమి కిష్టగూడెం శివారు. సర్వే చేయిస్తే వాస్తవం బయటపడుతుంది. ఏకపక్షంగా చెరువు శిఖం పట్టా భూమిగా చూపడం పద్ధతి కాదు. ఇక్కడ ఏ రైతును అడిగినా వాస్తవాలు చెబుతారు. 335 సర్వే నంబర్‌లో తక్కువ భూమి ఉన్న విషయం అందరికి తెలిసిందే. లేని భూమిని కొని వివాదం చేయడం తగదు.

– చెట్టబోయిన రవి, కిష్టగూడెం రైతు



### ముమ్మాటికి చెరువు శిఖమే..

తాను నైజాం జమానా నుంచి నీరటి పనిచేస్తున్నాను. ప్రతి కారు చెరువు అజమాయిషీ చేసేవాన్ని చెరువు శిఖం సంగతి నాకు తెలుసు. మా చెరువును ఆక్రమించుకోవాలని చూస్తున్నరు. చెరువు శిఖంలో మరోగ్రామం భూమి ఎందుకుంటుంది. సర్వేయర్లు చూపిన హద్దులను వాళ్ల పై అధికారి తప్పు అనడం ఎట్ల. ఇందులో ఏదో మర్మముంది.కిష్టగూడెంలో భూమి కొని అప్పిరెడ్డిపల్లి చెరువులో చెట్లు కొట్టడం ఎంతవరకు సమంజసం. వాళ్ల ఆటలు సాగనివ్వం.

– దండు కొండయ్య, నీరటి, అప్పిరెడ్డిపల్లి

## జీపీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

బచ్చన్నపేట, ఏప్రిల్ 23 : గ్రామ పంచాయతీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పంచాయతీ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మల్టీ పర్ప స్ విధానంతో నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏఏ హోదాలో పని చేస్తున్నారో వారు పని చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అందుకే మ ల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని ఆయన కోరారు. పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కారోబార్లు, బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్న వారికి ప్రత్యేక హోదా వర్తింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేలుకంటి మురళి, ప్రచార కార్యదర్శి కాళ్ల ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురెల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి బాబుగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆశోక్, మండల అధ్యక్షుడు టేకులపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాస్, దయాకర్, రాజు, శ్రీనివాస్, ఆశోక్, నాగ య్య, శ్రీనివాస్, దేవయ్య, శివ పాల్గొన్నారు.



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న జీపీ సంఘం నాయకులు

## ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 23 : జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పర్యాటకులపై ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అమాయకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరపడం పిరికిపందల చర్య అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, మాజీ అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, నాయకులు ఉడుగుల రమేశ్, శివరాజ్ యాదవ్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు ప్రజలను వేలాదిగా తరలించాలి

ఊరూరా ప్రచారంలో బీఆర్ఎస్ నాయకుల పిలుపు



కోలుకొండలో సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



వెల్దండలో బీఆర్ఎస్ గద్దెకు రంగులు వేస్తున్న కార్యకర్తలు

దేవరుప్పుల, ఏప్రిల్ 23: బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్నందున మండలం నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులతోపాటు ప్రజలను తరలించాలని నాయకులు కోరారు. బుధవారం మండలంలోని కోలుకొండ, నల్లకుంట తండా, పొట్టిగుట్ట తండా, ధర్మాపురం, లకావత్ తండా, కడవెండి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో సభ వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. బీఆర్ఎస్ మండల నాయకులు పల్లా సుందరరాం రెడ్డి, బస్వ మల్లేశ్, తీగల దయాకర్, జేరిపోతుల సాయిలు, ధరావత్ రాంసింగ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లవుతున్న నేపథ్యంలో ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధినేత కేసీఆర్ సభలో ప్రసంగిస్తారని వివరించారు. సభకు అన్ని గ్రామాల నుంచి ప్రజలను తరలించాలని ఆయన కోరారు.

### నర్మెటలో..

నర్మెట : బీఆర్ఎస్ రజోత్సవాల నేపథ్యంలో మండల వ్యాప్తంగా గులాబీ శ్రేణుల్లో పండుగ వాతావరణం నెలకొంది. అన్ని గ్రామల్లో కార్యకర్తలు జెండా గద్దెలను శుభ్రం చేసి రంగులు వేస్తున్నారు. ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ మహాసభకు ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ కార్యకర్తలకు ప్రజలకు వివరిస్తున్నారు.



చీటూరులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### లింగాలఘనపురంలో..

లింగాలఘనపురం : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి వేలాది మంది తరలివెళ్లాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని చీటూరులో బుధవారం సభ వాల్ పోస్టర్లు అంటించి ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని వారు కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తపెల్లి అభినాశ్, నోముల యాదగిరి, హేమేందర్, వెంకటేశ్, అనిల్, అయిల రమేశ్, శ్రీశైలం, శ్రీను, నర్సయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



నర్మెటలో చిన్నారులకు అన్నప్రాసన్న నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు

## అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 23 : పోషణ పక్షోత్సవాల సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కళాజాతా సంబురాలను అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి నేతృత్వంలో నిర్వహించారు. పోషకాహారం, పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగు నీటి ప్రాధాన్యతపై కళాజాతా ద్వారా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సామూహిక సీమంతాలు, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్న ప్రాసన చేశారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ గౌడ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, మునిగల రాణి, స్వరూప, సువర్ణ, మంగ, మారెడుపాక రాణి, గాదే సునీత, సీహెచ్ మంజుల, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### నర్మెటలో..

నర్మెట : అప్పుడే పుట్టిన శిశువుకు గంటలోపు ముర్రుపాలు అందించాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని కన్నెబోయినగూడెంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన్న, అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలను అందించాలన్నారు. మండల వైద్యాధికారి ఉదయ్ మాట్లాడుతూ చిన్నారులకు పోషకాహారం ఇవ్వాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఐలయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతాదేవి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ భాగ్య, ఏఎన్ఎం సునంద, గ్రామ ప్రత్యేకాధికారి సుకన్య, పంచాయతీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

### బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండలంలోని పడమటికేశ్వాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, ప్రేమలత, ఏఎన్ఎం జ్యోతి, ఆశవర్కర్లు భాగ్యలక్ష్మి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 23 : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక అన్నారు. బుధవారం ఆమె 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. పశువులకు వ్యాధి నివారణ టీకాలను ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు కొనసాగిస్తామన్నారు. మండలంలో 4,491 తెల్ల పశువులు, 5,971 నల్ల పశువులకు టీకాలు వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 624 తెల్ల పశువులు, 910 నల్ల పశువులకు టీకాలు ఇచ్చామని మౌనిక తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా రోజుకు ఒక గ్రామంలో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు టీకాలు వేస్తున్నామని, రోజుకు సుమారు 100 నుంచి 150 పశువులకు కవర్ చేస్తున్నామని వివరించారు. బుధవారం మీదికొండ గ్రామంలోని పశువులకు టీకాలు వేశామని తెలిపారు. పశువులను రెండు రోజులు నీడ పట్టున ఉంచాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మీదికొండ ఎల్ఎస్ఏ శ్రీనివాస్, గోపాలమిత్ర రాజేశ్ పాల్గొన్నారు.



పశువులకు టీకాలు ఇస్తున్న డాక్టర్ మౌనిక



జనగామ కోర్టులో సంతకం చేస్తున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

## కోర్టుకు హాజరైన మాజీ మంత్రి పొన్నాల

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 23 : జనగామ జిల్లా ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా నమోదైన కేసులో బుధవారం స్థానిక కోర్టుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య హాజరయ్యారు. కోర్టు హాల్‌లోని రిజిస్టర్‌లో పొన్నాల సంతకం చేశారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన జేఏసీ నాయకులతో కలిసి కొద్దిసేపు ఆయన ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆరుట్ల దశమంతరెడ్డి, మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, దేవరాయ ఎల్లయ్య, సౌడ రమేశ్, ఉడుగుల రమేశ్, ఆకుల శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, బక్క శ్రీను పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 23 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున్‌రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో పలు అంశాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్లలో వంద శాతం ఇమ్యునైజేషన్ సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శశక్త్ పోర్టల్‌లో ఏబీహెచ్ఏ ఐడీ లింకేజీ వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. గర్భస్రావ రేటును తగ్గించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఏఎన్ఎంలకు ఏఎన్‌సీ లక్ష్యాలను నిర్దేశించాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్యం కోసం వచ్చే రోగులపట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. కుక్క, పాము కాటుతో వచ్చే రోగులకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై, వైద్య సహాయం కోసం సూచించే ప్రచార వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ పట్టణ అభివృద్ధికి కృషి

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 23 : జనగామ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రంగప్ప చెరువు నుంచి గార్ల కుంటకు వెళ్లే వరద నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో హైదరాబాద్ రోడ్డు మార్గంలో వరద నీటి ఉధృతికి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పనులు చేపట్టినట్లు తెలిపారు. హనుమకొండ రోడ్డు మార్గంలో ఉన్న దయానిలయం పక్కన గల సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ రాజ్‌కుమార్, ఏఈ మహిపాల్ పాల్గొన్నారు.



మార్కెట్ పనులను పరిశీలిస్తున్న పింకేశ్‌కుమార్

## జిల్లా కోర్టు జడ్జిగా ప్రతిమ బాధ్యతల స్వీకరణ

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 23 : జనగామ జిల్లా కోర్టు నూతన జడ్జిగా బీ ప్రతిమ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతిమకు సీనియర్ సివిల్ జడ్జిలు విక్రమ్, సుచరిత, జూనియర్ సివిల్ జడ్జిలు శశి, సందీప మర్యాదపూర్వకంగా స్వాగతం పలుకుతూ మొక్కలను అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ యాదవ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిమకు స్వాగతం పలుకుతున్న జడ్జిలు

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 23: ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షురాలు ఖలీదాబేగం కోరారు. ఈ మేరకు బుధవారం ఎంఈవో జీ కొమురయ్యకు వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల ఏజెన్సీలను కొన్ని పాఠశాలల్లో ఇష్టారీతిన మార్చుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. వంటలు చేసిన వారికి ప్రతినెలా బిల్లులు విడుదల చేయడం లేదన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులను మార్చొద్దని ఖలీదా బేగం కోరారు. దీనిపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం బాధ్యులు భాగ్యలక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.



రఘునాథపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## కొత్త చట్టంతో భూముల పరిరక్షణ : కడియం

రఘునాథపల్లి/లింగాలఘనపురం, ఏప్రిల్ 23: రైతుల భూములకు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం రఘునాథపల్లి, లింగాలఘనపురం మండల కేంద్రాల్లో భూభారతి చట్టంపై జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషాతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించారు. శ్రీహరి మాట్లాడుతూ గ్రామాల్లో భూవివాదాలు లేకుండా, ఆక్రమణలకు చెక్ పెట్టేలా కొత్త చట్టం ఉపయోగపడుతుందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 లక్షల సాదా బైనామా దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించవచ్చన్నారు. భూ విస్తీర్ణంలో మార్పులు, మిస్సింగ్ సర్వే నంబర్, సవరణలు వంటి సమస్యల పరిష్కారానికి పోర్టల్ రూపొందించినట్లు ఆయన తెలిపారు. వచ్చే జూన్ 2వ తేదీ నుంచి ఆన్‌లైన్ లో భూభారతి చట్టం రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జనగామ ఆర్డీవో గంగా రాం, తహసీల్దార్ ఎండీ మోసిన్ ముస్తాబా పాల్గొన్నారు. లింగాలఘనపురంలో నిర్వహించిన సదస్సులో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, సుహాసిని, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, డీటీ ఫణీందర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

లింగాలఘనపురం, ఏప్రిల్ 23 : జనగామ –సూర్యాపేట జాతీయ రహదారిపై నెల్లుట్ల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మరణించాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగర శివారు నారపల్లికి చెందిన తీగల సోమనర్సయ్య(70) బుధవారం తన భార్య అన్నపూర్ణ, కుమారుడు శ్రీధర్, కోడలు ప్రణీతతో కలిసి కారులో తుంగతుర్తిలో జరిగిన ఓ వివాహానికి హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో నెల్లుట్ల సమీపంలోకి వస్తుండగా జనగామ నుంచి బానాజీపేటకు బైక్‌పై వెళ్తున్న హరీశ్ ఎదురుగా రావడంతో ఆయనను తప్పించబోయి పక్కనే ఆగివున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో సోమనర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ప్రయాణిస్తున్న హరీశ్‌తో సహా మిగతా వారికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.